# నీతిలేని కమల



కమల వరుసగా రెండు మూడు రోజులు తెల్లవారకముందే లేచి పెరట్లోకి పోయి కాలువలో వాంతులు కక్కేసి బాల్చీతో రెండు బాల్చీల నీళ్లుపోసి కడిగివేసింది. ఆమెకు తెల్లవారక ముందే లేవడం కొన్ని సంవత్సరాల నుంచీ అలవాటే. కాని ఈమధ్య రెండు మూడు రోజులనుంచీ వరుసగా మధ్యాహ్నం అన్నం తినకపోవడం, అధమం తక్కువగా తిని లేచి పోవడం, తెల్లవారుజామునే లేచి ఏదో డోకు కోవడం, ఎటూగాని వేళ ఆకలేస్తోం దనడం- చూస్తే కమల తల్లి శాంతమ్మకు బెంగపట్టి పోయింది. పెళ్ళికాని పిల్ల-ఇంకేమన్నా వుందీ?

దీనికి సాయంగా ఆవిడ లెక్క ప్రకారం రెండు నెలల క్రిందట తన అన్నకొడుకు రామేశం తమ యింటి కొచ్చి ఆరు రోజులున్నాడు. రామేశం కమల దగ్గిర సిగ్గుపడడనీ, కమల రామేశం దగ్గిర సిగ్గుపడదనీ అందరికీ చిన్నతనం నించీ తెలుసు. పైగా అతను కిందటిసారి వొచ్చిన ఆరురోజులూ కమల ఒక్క క్షణం కూడా, ఆ పార్కులో యీ లేడీస్ క్లబ్బులో ఆ రీడింగురూములో తిరగకుండా అతనితోనే ఏవేవో మాట్లాడింది. అదీ యిదీ ఇంగ్లీషుని మాట్లాడడం- తెగ నవ్వడం-ఇవన్నీ శాంతమ్మకు జ్ఞాపకమున్న ప్రకారం.

శాంతమ్మ ఈ రెండు ఆధారాలూ తీసుకుని కమలకి నెల తప్పిందని నిర్ణయించింది. ఆమెలో ఎన్ని రసాలు పని చేశాయో చెప్పలేము. ఏది ఎలా వొచ్చి పిల్లకి గర్భిణీ నిజమే అయితే? పెళ్ళికానిది. ఎవరన్నా ఇంట్లోకి రానిస్తారా? పచ్చి మంచినీళ్లన్నా దొరుకుతాయా?- రామేశంగాడికి ఇది ఎలానో రాసి పెట్టేవుంది; కాని ఆ దిక్కుమాలిన వొదినెగారు కట్నాలదగ్గిర పేచీ తెస్తుంది కద! ఎలాగయినా రెండు వేల అయిదు వందలు లేందే మావాడి పరువు నిలబడ దంటుంది. చూస్తూ రెండువేల అయిదు వందలు ఇవ్వడం మాటలా?-తిక్కపిల్ల-ఈ మహా పట్నంలో ఏ సూటేశ్వరరావుని వలచిందో, వాడి కెంతమంది పెళ్లాలో ఎంతమంది పిల్లలో? ఎవడో పరాయివాడే అయినా వాడికిచ్చి పెళ్ళి చెయ్యకపోతే నూతిలోపడిచస్తానని మొదట్నించీ ఇది మెల్లగానో గట్టిగానో అంటూనే వుంది! - ఇక అన్నిటికన్నా ముఖ్యమైంది– ఈ తిక్కమనిషి అధర్మాత్ముడి పేరు చెబుతుందా అని - శాంతమ్మ మనస్సులో ఎంత తుఫాను రేగిందో మనకి తెలియదు.

ఆయనకేం తెలీదు. పొద్దున్నే లేవగానే- కమలా, అని పిల్చి అది రాగానే దానినెత్తి ఓసారి వాసన చూడడం-నుదిటిమీద ముద్దెట్టుకోవడం; ఎదురుగావున్న భారత మాత పటానికి ఓమాటూ వెనకగా వున్న శ్రీకృష్ణప్రభువు పటానికి ఓమాటూ నమస్కారం తను పెట్టి దాని చేత పెట్టించడం. ఎనిమిదిన్నరా ఆయేసరికల్లా వీధిలోకి వెళ్ళిపోవడం, మళ్లీ పన్నెండింటికి రావడం. - పోనీ వొచ్చినప్పుడైనా అదీ యిదీ మాటాడుకోవాలా, అదిలేదట - మౌనవ్రతం పట్టి వెళ్లిపోవడం. - రాత్రి రావడం ఏమిటిసంగతులని తనని అడగడం. అంత అంటీఅంట నట్టూ పట్టీ పట్టనట్టూ వుంటుంది ఆవ్యవహారం.

ఇక అప్పటికి ఆపనిచేసీ ఈపనిచేసీ తను అలిసిపోయి వుంటుంది. ఒక్కొక్కప్పుడు నిద్దరొచ్చిందని పడుకోవడం మరో అప్పుడు సంగతి సందర్భాలు మాట్లాడడం. ఇలాఅయితే యెలాగ అనే ప్రశ్న లేదు శాంతమ్మకి. కాని కొన్ని విషయాలు మాటుపడి పోతున్నయ్.

పైగా తాను ఆనాడు రాత్రి అమ్మాయి సంగతి మీరు కాస్తనా కనిపెట్టడంలేదు. దానికి నెల తప్పినట్టుంది - అనగానే పిచ్చిగా ఓ నవ్వు నవ్వాడు ఆయన. ఎంతో నిదర్శనగా చెబితేనేగాని అనుమానించలేదు. కమల నిప్పంటి మనిషి. భారతమాత స్వపుత్రిక-అదీ ఏం మాట్లాడినా!- మగాళ్లకేం తెలుస్తయ్ ఆడవాళ్ళ సంగతులు? తాను ఆడది; తనకి తెలుసు కమల కడుపుతో వున్నదని! పెద్దకొడుకు భీముడితో చెప్పింది, నువ్వు వెంటనే మామయ్య యింటికి వెళ్ళి అమ్మాయి పెళ్ళి సంగతి వేగిరం కనుక్కురా అని కావలసినంత మటుకు రహస్యాలు కూడా చెప్పేసింది.

* * *

ఏమిటో ఈ యింట్లో వాళ్ళ గుడగుడలు. అంతా తనని ఓ కొత్తమనిషిని చూసినట్టు చూస్తారేం? ఏమున్నది తనలో?- అందులో అమ్మ మరీ దీనిగా చూస్తున్నట్టు కనబడుతోంది. ఏమిటా చూపుల వైనం? తను దేంట్లోనీ పొరపాటుగా ప్రవర్తించలేదే! చదువు శుభ్రంగానే వుంది- వేషం ఫస్టుగా వుంది. నాన్నకి ఉదయం లేవగానే ఎప్పటిలా భారతమాత సత్పుత్రిక పాత్ర ధరించడానికి పోతున్నది - అయితే ఒక్కటి అయివుంటుంది. ఈ మధ్య కొంచెం ఇంట్లో తిండి తినటంలేదు. అందుచేతనేమో!

వెధవ రేషను బియ్యం. ఈవారం క్రిందటి వారం మరీఘోరంగా వున్నాయి. అన్నం ఏమీ సయించడంలేదు. అయిదు రోజుల క్రిందటినుంచీ మొదలు. రాత్రి అన్నం - రాత్రి పదకొండు గంటలదాకా చదువు ఫలితమో లేక తాను ఈ మధ్యనే అలవాటు చేసుకున్న పక్క ఫలితమో-లేక రెండిటిఫలితమో-ఉదయం లేచేసరికి డోకు వచ్చేస్తూంది. ఆకలి విపరీతమై ఉదయం బంట్రోతువాడి చేత ఎవరూ చూడకుండానే తెప్పించుకుంటున్నది ఏవో చాలా పదార్థాలు.

దాంతో మధ్యాహ్నం అన్నం ఏమీ తినలేకపోతున్నది. ఏదో చిరాకుగా కాస్త తిని లేచిపోతుండడం వదినెలకీ అన్నలకీ తమ్ముళ్లకీ కూడా నోటినిండా సంగతైంది. వదినెల పరాచికాలు తనకి ఎన్నడూ రుచించలేదు. వాళ్లు పల్లెటూళ్ల నుంచి వచ్చారు. మోటుగా ఏదో హాస్యం ప్రయోగిస్తారు. తనకి అది అస్వాభావికంగానూ కృత్రిమంగానూ కనిపించి వాళ్లకి కోపసూచితమైన ముఖం పారేస్తుంది తాను. మధ్యాహ్నం ఆ విధంగా అన్నం సయించకపోగా మూడు గంటల వేళప్పుడో లేక అంతకు ముందో తాను మళ్లీ హోటలునుంచి సంబారాలు తెప్పించుకుని తింటున్నది. ఈ రీతిగా అవి అన్నం సాటి చెయ్యక తాను చిక్కి పోతున్నది. ఆ సంగతి తన ముఖంలోనే బాగా కనబడుతున్నది. కమల నీరసిస్తున్నది!

కాని ఈ మాత్రం దానికి గుసగుస లాడుకోవడం దేనికి? నాన్న ఎన్నాళ్ళనుంచి అన్నం సరిగా తినటంలేదో ఎవరన్నా చూశారా, ఎవరన్నా గుసగుస లాడుకొన్నారా దానిమీద? ఆలాగే తన విషయమూ ఊరుకోకూడదూ? తను అన్నం తింటే వీళ్లకేం తినకపోతే వీళ్లకేం? అంటే తను అన్నం తినక పోవటంలో ఏదో ప్రత్యేకత వీళ్లకి కనిపించిందా?- లేక తాను హోటలునించి రెండు పూటలా ఏవో తెప్పించుక తింటున్నట్టు వాళ్లకి తెలిసిందా? తెలిస్తే మాత్రం తప్పా? ఏమిటో వీళ్ల వైనం అంతు చిక్కటం లేదు.

* * *

ఈ రోజు మరీ అధ్వాన్నంగా వుంది అమ్మాయి తిండి. ఒక్కఆధరవుతోనైనా సరిగా తిన్నదిగాదు. బలవంతపెట్టి పాపం - తింటుందేమోనని తండ్రి పక్కని కూర్చొ పెట్టింది. ఆ తల్లి మనసు ఎంత ఆవేదన పడుతున్నదో - అమ్మాయి వేవిళ్ల సంగతి-నిజమే కావచ్చు. తను నమ్మలేకపోయాడు. కమల ఆవిధంగా తొందర పడే మనిషికాదు. ఆమె సంగతి తాను చిన్నతనంనించీ ఎరుగును. ఏపని అయిలా చాలాబాగా ఆలోచించి చేస్తుంది. అలాంటిది ఇంత పెద్ద విషయము గురించి మరీ తీవ్రంగా ఆలోచించవలసిన మనిషిగాని దుడుకుగా ఉద్యమించ వలసిన

మనిషికాదు. అయితే ఆ ఈడు మనుష్యుల సంగతి చెప్పలేము. వాళ్ల భావాలు క్షణంలో వ్యతిరేక నిర్ణయాలకి కూడా అనుగుణమై పోతాయి. స్థిరత్వం చాలా అరుదు. అందు చేత ఈపనికి ఉద్యమించి ఉండవచ్చు. నిజానికి విద్యాభ్యాసం చాలమందిలో మార్పులు తెచ్చినా కమలలో మాత్రం ఏమార్పులూ తేలేదనే చెప్ప వచ్చు. మరి ఈ విషయంలో ఎందుకు తొందర పడ్డాదో! ఎందుకయినా మంచిది. డాక్టరు చేత పరీక్షచేయించి అదేదో కాస్తా తీయించేస్తే, లేక ఆమనిషిని కనుక్కొని వేగం వివాహం చేసేస్తే నలుగురిలోనూ మాటపడే అవసరం తప్పిపో తుంది. దీనికి శాంత చాలా గాభరాపడిపోతోంది. రాత్రి నిద్దరోదు పగలు తిండి తినదు. ఏమయినా ముందు కమలని పిలవాలి. ఓహో! రీడింగు రూముకి పోతుందిగా!

* * *

జానకి ఏమిటో అంటుంది గాని ఇంతో అంతో తనకన్న అనుభవం లేనిదనే చెప్పవచ్చు. తోడికోడలు, తనకన్న పెద్దదే కావచ్చు. కాని అనుభవంలో తనకన్న చిన్నదెన్యేనని రూఢిగా చెప్పగలదు తాను. వేవిళ్ళనిశ తాను బాగా ఎరుగును. ఆగడ తన అన్నగారి భార్యకు వేవిళ్లప్పుడు ఆవిడ సరిగ్గా ఇలాగే ప్రవర్తించేది. కమలమ్మ మాత్రం మనిషేనా మరేమైనానా! అందు చేత అందరికీ వచ్చిన దశే ఆమెకూ వచ్చింది.

కాని ఈ పట్నపువాళ్లతో విడ్డూర మేమి టంటే పెళ్ళి కాకముందు స్త్రీలు గర్భిణులు కావడం వింతకాదు. అక్కడా అక్కడా కన పడుతూనే ఉంటుంది. ఎవరికి తెలీదు గనక–లేకపోతే ఆ మేనత్త కొడుకుతో అలా రాసుకు తిరుగుతుందా, తను ఎంతచదువుకొన్నదీ-ఎంత గారాబంగా పెరుగుతున్నదీ అయినా అంత సిగ్గులేకపోవడమూ?

ఇక కమలమ్మ గర్వానికి అడ్డూ అపూ అంటూ లేవు. మొన్న-నిన్నగాక ఏమయిందీ-తానూ తోడికోడలు జానకి, కమలమ్మా డాబా మీద నిల్చుని దారంట పోయేవాళ్ళని చూస్తుం డగా, అక్కడికి వెళ్ళి ఏదో మాటలసందర్భంలో 'తనకి వేవిళ్ళన్న సంగతి మనకి తెలీదని అనుకుం టున్నది వదినె—' అన్నది తాను. దానికి కమల చీదరించుకుని వెళ్ళిపోయింది. ఎందుకో అంత గర్వం. ఎలాగా తమకి తెలిసిపోయింది-కమలమ్మ సంగతి. పెట్టెలాంటి ఈ యింట్లో అందరూ కలిసికట్టుగా వుండాలా లేక కొట్లాడు కోవాలా? మాటకి, ఆ విధంగా కమల తనతో వివాదం కాకపోయినా, విరోధం పెట్టుకున్నది గదా! తాము పెళ్లి లాకానికి ఛాటలేరూ, పెళ్లి కాని మా వదినెగారికి వేవిళ్ళు సుమండీ అని! ఆమాత్రం భయం ఉండక్కర్లా? తనమీద అంత గర్వమా? ఏమయినా కమలమ్మకి కాస్త యినా ఆలోచనాశక్తి లేదు. దుడుకుగా వున్న ఆమె ప్రవర్తనని తాము కాబట్టి క్షమించారు; సహించారు. మరోరకం కోడళ్ళయితే చాటే స్తారు!

* * *

అయితే ఇదా ఈ గుడగుడల సారాంశం? అసలు ఇంత బ్రహ్మాండమైన ఆలోచన యెవరికి కలిగింది చెప్మా? కలిగితే అమ్మకి లేదంటే చీమ మిరపకాయ చిన్నవదినెకే కలిగి వుండాలి. పెద్ద వదినె ఉత్తి మెమ్మె. అసలు ఏసంగతీ చెప్తేనే పోల్చుకోలేదు. అలాటిది వేవిళ్ళ సూచనలు అవిడ కనిపెట్టేదేమిటి. ఈ చిన్నవదినె లేమూ, ఈవిడ దేశాంతకురాలు. అమ్మమ్మమ్మ! అవ లిస్తే పేగులు లెక్కపెట్టేస్తుంది. అమ్మకికూడా తెలియదనే చెప్పాలి. అందు చేత ఆవిడకే అను మానం తట్టికుండవచ్చు. అమ్మ అయితే యిలా అందరితోనూ చెప్పెయ్యదు! కాని ఎలాగో తెలి సింది అందరికీ. ఒకసారి తన వాంతిని తాను నీళ్లతో కడిగేస్తుండగా అమ్మ చూసింది. అదే మిటి అలా కడిగేశావ్, వాంతి ఎందుకు వెళ్లింది అని అడిగింది. తనకి ఏవిషయమూ మాట్లాడడం ఇష్టంలేదు. ఆడవాళ్లంటే అదోరకం అసహ్యపు భావం. అందుచేతనే, ఈ వాంతి ఎందుకు కడిగి వేసిందికూడా చెప్ప లేదు.

బలే బాగానేవుంది. నేను గర్భిణినా! గోరంతదాన్ని కొండంత చెయ్యడం ఇంకే మన్నా చూసి అన్నారా ఈ పూర్వులు! ఇలాంటివే యేవో చూశారు. అయినా వీళ్ళ అనుమానం సహేతుకంగానే వుంది. రామేశం బావ రెండు నెలల క్రిందట వొచ్చాడు. క్రిందటి

మాటు వొచ్చినప్పుడు ఆరు రోజులూ నేను ఎక్కడికీ కదలనుండానే బావతో అవీ యివీ మాట్లాడాను. పైగా ఎక్స్‌కర్షను రోజులలో నెల అయింది. అది వీళ్లు లెక్క పెట్ట లేదుగా! దాంతో నిర్ణయానికి వచ్చేశారు. మరి ఈ నెల యింకా ఇరవై ఎనిమిది రోజులైనా ఇంకా కాలేదు. రేపో నేడో కావచ్చు. వీళ్లని కొన్నాళ్లు ఓ పెద్ద గాభరాలో పెడితే!— అదీ తమాషా. ఈసారికూడా నెల అయినట్టు చెప్పకండా గడిపెయ్యాలి. దాంతో వీళ్ళకి అనుమానం రుజువయిపోతుంది. సరే దీనికేం చెయ్యాలి? విజయవాడలో సరళవుంది. దాని దగ్గిరకి పోతాను. - మరి అక్కడికెళ్తే రామేశం బావని చూడనా మాననా? సరే చూడవచ్చు మానవచ్చు గాని వీళ్ళకి అనుమానం చాలా ఎక్కువై తబ్బిబ్బవుతారు. గర్భిణీతో వుండి సరళ దగ్గిరికి అని నెపం పెట్టుకుని రామేశం బావ దగ్గిరికి ఏదో మాట్లాడుకుందికి పోయాననుకుంటారు. అదీ వాళ్ళ గాభరా. కాని ఈ వుపాయం చాల బాగుంది.

అన్నయ్య విజయవాడ వెళ్ళాడు. ఎందుకని? ఇది చెప్పి అత్తయ్యని కవ్వించిందికి కాబోలు. పాపం అత్తయ్య వీడికి లొంగుతుందా - పోండి మా వాడికి గర్భిణీని పెళ్ళి చెయ్యం అంటుంది!

* * *

పాపం - అత్తయ్య కట్నం కోసం ఆగింది గాని పిల్లలు ఇంక తొందరపడతారనుకోలేదు. వాళ్ళకేం తెలుస్తుంది వీళ్ళ తొందర? ఏదో కక్కుర్తిపడ్డారు. గ్రంథం చాలవరకూ నడిచింది. చివరకి వేవిళ్ళప్పుడు ఆడాళ్ళకి మెలకువవచ్చింది. తననుకుంటూనే ఉన్నాడుగా — రామేశంగాడు కిందటిమాటు ఇక్కడున్న ఆరు రోజుల్లోనూ వాళ్ళిద్దరి కిలకిల సంభాషణలూ చూసి ఏదో కథ జరిగిపోతూందని! ఎవరితో చెప్పలేదు గాని తానూ చూశాడు కమల ఒకసారి తెల్లవారక ముందు మేడ మీంచి వేగంగా దిగి పెరట్లో నూతిదగ్గిర డోకుకోవడం, భయం భయంగా కడిగెయ్యడం!

చాలా తమాషాగా జరిగింది అత్తయ్య దగ్గిర కథ. తనూ వెళ్ళాడు, అత్తయ్య, వదినే పోల్చేశారు తాను వచ్చిన పని. ఎంత లౌక్యంగా అడిగింది అత్తయ్య కట్నం విషయం! రెండువేల అయిదువందలకి ఎక్కువే యిస్తామన్నారట కట్నం, వాళ్ళెవరో! మేనరికం వొదులుకోవడ మెందుకూ - పిల్లలిద్దరూ మొదట్నుంచీ కలిసి మెలిసి తిరుగుతున్నారు - అని ఆపేసిందిట. వాళ్లిద్దరూ కలిసిమెలిసి వుండబట్టే యిలా మునిగింది కొంప! నువు కట్నమంటావు, దాని సంగతి తరువాత ఆలోచించవచ్చు; ముందు ఈ సంగతి చూడు అమ్మాయికి అప్పుడే వేవిళ్లు, ఆమధ్య వీడు వొచ్చి మా యింట్లో ఓ వారం రోజులున్నాడు నీకు జ్ఞాపకం లేదా అని తాననేసరికి ఒక్కసారిగా నిర్విణ్ణురాలైంది! రేపటినుంచీ ఎవరూ ఇళ్లకి రానియ్యరు; వెధవ కట్నాల బేరం ఆరేళ్ళబట్టి సాగుతున్నది ఇప్పటికొచ్చి తేలడం లేదు అని ఆలోచించింది గాబోలు. మా వదినెగారి కోస్తేనేం మా కోస్తేనేం ఆ అగౌరవం అగౌరవమే అవుతుంది, మేం వారం రోజుల్లో మీ యింటికి వస్తాం కమలాన్నిమాత్రం యెక్కడికీ వెళ్ళనియ్యకండి; కాస్త ఇంట్లోనే ఉండనివ్వండి-అని హడావుడిగా చెప్పింది అత్తయ్య! మర్యాదస్తురాలు.

* * *

ఛీఛీ, ఇంత విషాదాంతం ఎప్పుడూ యెరుగదు. సరిగ్గా స్టేషనుదగ్గిర పట్టేసుకున్నాడు పెద్దన్నయ్య. సాయంత్రం బండికి వెళుదువుగాని అన్నాడు. కాని అన్నయ్యకికూడా తెలిసిందన్నమాట యీ గాలి కబురు. ఉత్తిమనిషివా మునపట్లే తిరిగేందుకు! అని గదమాయించాడు. ఎక్కడికి టిక్కెట్టు, అని అడిగి తెలుసుకుని ఎవరింటికని అడిగాడు. తను జవాబు చెప్పగా ఏవో నాలుగు చీవాట్లేశాడు. ఆవేశంలో వంశాన్ని పొగిడాడు. ఎవరికీ కమలను చీవాట్లు వేసిందికి లేని మొండి ధైర్యం తనకి వున్నందుకు తనని గూర్చి ఏరాక్షసుడో జాలిలేని కటికివాడో అనుకోమన్నాడు. అలా వెళ్ళింది అన్నయ్య ధోరణి. ఇంట్లో చెప్పలేదు; తను వ్రాసి బల్ల మీద వుంచిన ఉత్తరం యెవరూ చూడలేదన గానే అన్నయ్య కోపం మరీ హెచ్చయిపోయింది! దొంగపని చేశావు గాబట్టి నీకీ భయం పుట్టిందని అపవాదు వేశాడు. ఆ మాటలు ఇంట్లో అందరూ విన్నారు. గుడ్లప్పగించి

చూస్తున్న తమ్ముళ్ళనీ, కలవరించుకున్న తల్లిదండ్రులనీ, చిన్నన్నయ్యనీ, గుసగుసలాడేందుకు సమయం దొరకక కిటకిటలాడిన వదినెలనీ ఆశ్చర్యంలో ముంచిందుకు తనకి గర్భం లేదని ఏ ముఖంతో చెబుతుంది తాను?

చెప్పాలనుకున్నది తాను, ఆ సమయంలోనే- ఎంత స్నిగ్ధ కవిత్వంతో మీరు నన్ను గురించి ఏమనుకుంటున్నారో అంతా వట్టిది. మీకు మనస్తత్వ శాస్త్రం అసలు తెలియకపోగా శరీర తత్వంకూడా, కొంచమైనా తెలియదని చెప్పటానికి మీ నిరర్థక అనుమానమే సాక్షి- అని. కాని అప్పటికి తనకి నోరు రాలేదు. ప్రయాణం విఫలమైంది, తనకి నెల తప్పినట్టు వీళ్ళు అనుమానపడే ఘడియలు ఇక చాలా తక్కువగానే మిగిలివున్నాయి అని తన ఇప్పటి విచారం! అంత తుఫాను మధ్యకూడా తనకి ఒకరిని తప్పుదారంట తీసుకెళ్దాం ఒకరిని ఏడిపిద్దాం అనే కోరికతో కూడిన గుణం- పోలేదు! తన ప్రకృతి తనకే అసహ్యం వేస్తున్నది. అధమం విచిత్రంగా తోస్తున్నది.

* * *

ఇంతకాదు అంత చెప్పినా ఆడవాళ్ళని నమ్మకూడదు. అందులో పట్నంలో చదువు మరిగిన ఈ లేడీలని! ఎంత విశ్వాసం లేనిది, కమల! చిన్నతనంనుంచీ తాను ఎంతగా ఆమెను కోరాడు! నీవు తప్ప అన్యురాలిని నేను ప్రేమించలేను గనుక నీవు నాకు తిరిగి అలాటి వాగ్దానమే చేయమని!-ఎన్నిసార్లు కమల అలా వాగ్దానం చేసింది. అలాటిది ఇప్పుడు ఛీ! ఏ పరపురుషుడిస్నేహమో కలిగించుకుని- నా మీద ఆ భారం తోసెయ్యాలని చూస్తున్నది- ఎంత టక్కులు నటించేది- వివాహం కాక పూర్వం ప్రబంధాలలో నాయికా నాయకులలాగ ప్రణయకేళులు సల్పేందుకి మానవునికి వీలు లేదనీ ఆ సూత్రం తనికి ఎక్కువగా వర్తించుతుందనీ! చివరికి తాను క్రిందటిసారి వాళ్ళింటికి వెళ్ళినప్పుడు ఆ వారంరోజులూ తనతో రెండుగజాలదూరం నించే అన్ని కులాసా కబుర్లూ చెప్పింది గాని దగ్గిరికి రానిచ్చిందా? తాను ఎన్ని సార్లు అవకాశం కల్పించుకుని కమలని తాకినా విముఖంగానే చూసిందిగాని నవ్విందా. అధమం మాట్లాడకుండా వూరుకుందా? ఒకసారి చెబితే చాలదేమిటి అని చీదరించుకున్నది! దాంతో తాను కమలని గురించి ఏమనుకున్నాడు- చాలా గొప్ప ఆదర్శం గల భారత నారి అనీ, నీతిమీద చాలా నమ్మకముందనీ అనుకున్నాడు! అదంతా ఇప్పుడేమయింది? గాలిలో కలిసిపోయింది. కమల ఏ పరాయి పురుషుడితో వుందో తాను చూడవచ్చాడా- లేదు. కాని లోకం ఏమంటుంది? తాను కమలతో విచ్చలవిడిగా, తిరిగిన ఫలితమే యిది అని నిశ్చయిస్తుంది. అందుకనేగా, వాళ్ళు వేగం పెళ్ళిచేసుకోమనీ తల్లి వేగంచేసుకుంటూ మనసీ అనుకోవడం? ఈనాటికిఉదయం పెద్దబావ వెళ్ళాక తల్లి తనతో ఉల్లాసంగా ఈ మాట చెప్పడం ఏమయినాకానీ. లోకాన్ని ఎదిరించాలి. ఈ గర్భిణీస్త్రీని వివాహం చేసుకోడానికి అంగీకరించకూడదు. అంగీకరిస్తే యేమౌతుంది, ఆత్మవంచన తప్ప? రేపటి ఉదయం కమలకి కొడుకు పుడతాడు. వాడిని తన పెద్దకొడుకుక్రింద చూసుకోవాలి, ఎంత సహన శీలికైనా అది చేతవుతుందా? పైగా దూరంనుంచి ఆ కుర్రాడి తండ్రి తనకేసి చూస్తూ వికటాట్టహాసం చేస్తాడు. ఇది సహ్యమా? సహ్య సాధ్యమా! యుద్ధానికి అమ్మతో చెప్పకనే, పోతాను!

* * *

ఆవేదన ఎక్కువగా వున్నా, కోపాలు పీక మునిగేటట్టువున్నా, హాస్య రసం మటుకు ఎప్పటికప్పుడు ఉత్పత్తి అయిపోతోంది. తనకి మాత్రం దీని అంతమేమిటో చూస్తేనేగాని తనకి మళ్ళీ నెల అయినట్టు చెప్పాలని లేదు. రామేశంబావ వురుములుకక్కా వెళ్ళాడు క్రిందకి. వాళ్ళతో దెబ్బలాడుతాడు గావున్ను. లేదు. వాళ్ళతో దెబ్బలాడకుండానే వీధిలోకి వెళ్ళిపోయాడు! అలాయింటికి వెళ్ళిపోడుగద! ఏమో, చెప్పలేము.

అరె- తిరిగివచ్చేశాడే, అత్తకూడా వచ్చిందే-

అన్ని మాటలూ అయ్యాయి. రామేశం అందరికీ మతులు పోయాయన్నాడు. మీయింటికి రోజూ ఎవడో కుక్క వొచ్చి ఒక అకార్యం చేసిపోతూవుంటే, మరో కుక్క మీయింట్లోనే ఆ అకార్యం ఫలమనుభవించడానికిసిద్ధంగా వుంటే పోల్చుకోలేని మీరు క్షమించమని ఏ మొహం

పెట్టుకుని అంటున్నారు - అని రామేశం అగ్గి అయి పోయాడు.

కమల మెల్లగా వేరుగావున్న ఓ కుర్చీమీద చతికిలపడి- అందరూ మమ్మల్ని శ్రద్ధించిన వారు అయారు. ఎవరి సంగతి ఎవరికి తెలియదు గనక? చిన్న వదినగారూ, దాహ మౌతోంది కొంచెం చెంబుతో మంచినీళ్లిస్తారూ- ఒరే తమ్ముడూ- నువ్వు కొంచెం అలా వొంగి ఆచాప ఇలా పడేయ్ అనక మేడమీదికెళ్లి నా టేబిలు మీద పుస్తకా లున్నయ్, అందులో ఏదో వొకటి తే!' అన్నది.

అందురూ విస్తుబోయారు. కానిమూడునాలుగు రోజులలో తేలిపోయింది కమల ఢోకులసంగతి. కాబోయే అత్తగారు అన్నది: చూడరా అబ్బాయి వీళ్లలౌక్యం, కడుపుతో వుండగానే మనం వొప్పుకొని ముహూర్తం పెట్టించగానే యిలా తేల్చేసింది. కట్నం సంగతేమిటి? ఎవరి చేతనైనా చెప్పిద్దామా మనవూరెళ్లి? ఎవరూ వినలేదనుకున్నది ఆమె. కాని కమల ప్రక్క నుంచి ప్రవేశించి 'మీకన్నా లౌక్యం ఎరగ మండోయి అత్తయ్యా. బావగారికి రెండువేల అయిదువందలకన్న యెక్కువగా ఎవరో ఇస్తామన్నారటగా! - పోనీ అది యెందుకు లెండి. మీకు కట్నం సంగతి యెవరితోనూ చెప్పించ నక్కర్లేదు. నేనే చెప్తాను. అయినా మీకు లౌక్యం అతి అయిపోయింది. లేకపోతే నాన్నని అడిగి వుందురు! - ఆమాత్రం లౌక్యం తగ్గించుకుని ఆయన్నే అడిగి వుంటే సరిపోను. నేను ఆయనకి ఒక్కర్తెనేగా! ఆమాత్రం కట్నమివ్వలేకపోము!' అన్నది-రామేశం అక్కడ ఉన్నాడన్న దృష్టే లేకండా.

అతనన్నా ఏం చేశాడు ఉండి? అక్కడ లేనివాడిలా తలవొంచుకున్నాడు!

# “అభ్యుదయ నిరోధక రచనలు”

'తెలుగు స్వతంత్ర మే ౧ వ తేదీనాటి సంచికలోను, మే 26 తేదీనాటి సంచికలోనూ "అమరశ్రీ" అను రచయితగారిచే రచింపబడిన వ్యాసములు ప్రచురింపబడినవి. ఇందలి దోషాదోషములను విమర్శింపబూనుట నాబోటి సామాన్యునికి తగినపని కాదేమో!

మన దేశములో అంటరానితనమనే పిశాచము ప్రజానీకముయొక్క నరములలోనికి ఎక్కి, సంఘమును నిర్వీర్యము చేయుచున్నది. అందులో గ్రామాలలో స్థితిని తమబోటివారికి తెలుప నవసరముండదు కదా! కాని మారుమూల గ్రామాలలో అస్పృశ్యతా నివారణకై సేవ చేయుటను ఎంతో నీచముగ పరిగణింపుచు, అట్టి కార్యక్రమములో పనిచేయుచున్న వ్యక్తులను నీచాతినీచ ఆరోపణలతో నిందించుటయే లక్ష్యముగ పెట్టుకొని, పైరచయిత రెండు వ్యాసములను ప్రకటించినారు. ఈ విషయమును తమరు గమనించి యుండకపోరేమో!

ఆంధ్రదేశములో ఉదాత్త భావములతో, గంభీర విషయప్రచారము సలుపు సంపాదకత్వమును గలిగిన పత్రికలలో 'స్వతంత్ర' ప్రథమ శ్రేణికి చెందినదని తలంచుచుంటిమి. కాని సాంఘిక సేవకు గొడ్డలిపెట్టుగా నుండినట్టియు, సాంఘిక సమైక్యతకు కృషిచేయుచున్న మాబోటి సామాన్యవ్యక్తులను పరోక్షనిందాశైలిలో నీచాతినీచ ఆరోపణలతో నిందించునట్టియు నిట్టి పేలవపు రచనలకు తమ పత్రికలో స్థానమెట్లు లభించినదా అని ఆశ్చర్యపడవలసి వచ్చుచున్నది. పైగా విషయసూచికలో మాత్రమే 'కథానిక' అని వేయుటలో యుక్తి కూడ కనుపించుచున్నది. భగవంతుని అనుగ్రహము వలన యిట్టి అభ్యుదయ నిరోధకమైన రచనలకు తమ పత్రికలో యికనుండైనా స్థానమీయరని ప్రార్థించుచున్నాను.

“హరిజన సేవకుడు.”